క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



శాయంపేట : వాకింగ్‌కు వెళ్లివస్తూ రోడ్డు దాటుతున్న వ్యక్తిని ద్విచక్ర వాహనం ఢీకొట్టిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన కందగట్ల కుమారస్వామి బుధవారం తెల్లవారుజామున వాకింగ్‌కు వెళ్లి తిరిగి వస్తూ రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన బాసాని రామకృష్ణ(హరీష్) పొలం పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై వెళ్తూ అతన్ని ఢీ కొట్టాడు. ఈ సంఘటనలో కుమారస్వామికి ఎడుమ కాలు విరుగగా రామకృష్ణకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కి సమాచారం అందించారు. అంబులెన్స్ ఆత్మకూరు నుంచి ఆలస్యంగా రావడంతో క్షతగాత్రులు గాయాలతో రోడ్డుపైనే ఉన్నారు. సంఘటన స్థలానికి అంబులెన్స్ చేరుకోగానే క్షతగాత్రులను ఎంజీఎంకు తరలించారు.

సీపీఐకి రాజీనామా

పరకాల: సీపీఐ నాయకులు మూకుమ్మడి రాజీనామలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా నాయకుల విధానాలు, అతివాద పోకడలు, అహంకార పూరిత ధోరణిలు నచ్చకపోవడంతో రాజీనామా చేస్తున్నట్లు సీపీఐ పరకాల పట్టణ కార్యదర్శి బొట్ల ప్రభాకర్ తెలిపారు. ఆయనతో పాటు భవన నిర్మాణ కార్మిక సంఘం(బీటీసీ) మండల అధ్యక్షుడు అడపకుమార్, సీపీఐ, బీటీసీ మండలాల బాధ్యులు, కార్మికులు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లో చేరిక



దామెర: మండలంలోని ల్యాదెళ్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బుధవారం బీఆర్‌ఎస్ చేరారు. ఈ మేరకు పరకాల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి కండువాకప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ గ్రామ యూత్ అధ్యక్షుడు జెల్ల ప్రవీణ్‌మాధవ్, రెండో వార్డు సభ్యుడు కానుగుల శివరాజు, సీనియర్ నాయకులు బత్తుల రవీందర్, మిరియాల రవీందర్, అమరేందర్, యాదవ సంఘం నాయకులు జెల్ల సంతోష్, సంగాల రంజిత్, రమణాచారి, బండి నాగరాజు, సింద రాజుతో పాటు పలువురు చేరారు. అదే విధంగా పులుకుర్తిలో మండల యూత్ అధ్యక్షుడు మెంతు రాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్, బీజేపీకి చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



మండలంలోని సీతారాంపూర్, కోగిల్వాయి గ్రామాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రేవూరి ప్రకాష్‌రెడ్డి కండువాకప్పి ఆహ్వానించారు. ముత్యాలు, బాబు, అనిల్, రాజు, సాంబయ్య, రాజ్‌కుమార్, జశ్వంత్, నాగరాజు, నగేష్‌తో పాటు తదితరులు చేరినవారిలో ఉన్నారు. మండల అధ్యక్షుడు మన్నెం ప్రకాష్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పాలెపాక శ్రీనివాస్, నాయకులు గుడిపాటి శ్రీధర్‌రెడ్డి, కూనమల్ల రవీందర్, వేణు, సుధాకర్ పాల్గొన్నారు.

ఒక్కటైన ప్రేమ జంట



హన్మకొండ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహం సాక్షిగా ఓ ప్రేమ జంట ఒక్కటైంది. వివరాలు ఇలా ఉన్నాయి. కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామానికి చెందిన గౌడ సామాజిక వర్గానికి చెందిన బొగ్గుల రాజేష్ (23), ముస్లిం మైనారిటీ వర్గానికి చెందిన మహమ్మద్ సోనీ (21) నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. వారి వివాహానికి వధువు కుటుంబ సభ్యులు అడ్డుచెప్పడంతో సామాజిక, ప్రజా సంఘాల నాయకుల సమక్షంలో హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం మతాంతర వివాహం జరిగింది. అనంతరం, తమకు వధువు కుటుంబ సభ్యులతో ప్రాణభయం ఉన్నదని, రక్షణ కల్పించాలని హనుమకొండ హంటర్ రోడ్డులోని కాజీపేట ఏసీపీ కార్యాలయంలో ప్రేమికులిద్దరు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది, అసైన్డ్ భూమి సమితి (ఏబీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్, దళిత బహుజన ఫ్రంట్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లా వినోద్, న్యాయవాదులు తాళ్లపల్లి మధుకర్, సృజన, ఆయా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి

- ఏసీపీ కిశోర్‌కుమార్
- గ్రామాల్లో అవగాహన సదస్సులు



శాయంపేట : సదస్సులో మాట్లాడుతున్న ఏసీపీ కిశోర్‌కుమార్

శాయంపేట : ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలని ఏసీపీ కిశోర్‌కుమార్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పత్తిపాక గ్రామంలో బుధవారం గ్రామస్తులతో మాట్లాడారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్‌శాఖ ముందస్తు చర్యలు చేపట్టిందన్నారు. రాజకీయ కక్షలకు తావివ్వకుండా శాంతియుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎలాంటి సమస్య వచ్చినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వ్యక్తిగత దూషనలు, గొడవలకు దిగితే కేసులు నమోదు చేస్తామని అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేదిలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ మల్లేష్, ఎస్సై దేవేందర్, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

విద్యార్థులు, యువకులు, వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై దేవేందర్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సైబర్ క్రైమ్ పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కల్గి ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, డయల్ 100, సీసీ కెమెరాలతో కలిగే ప్రయోజనంతో పాటు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతంలోని యువకులు, ప్రజలు గుట్కా, గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లో సమస్యలు తలెత్తితే నేరుగా పోలీస్‌స్టేషన్‌కు రావాలని, ప్రజలకు పోలీసులకు మధ్య స్నేహ పూర్వకమైన సంబంధం ఉందన్నారు. ఎన్నికల నేపథ్యంలో గొడవలు సృష్టించుకొని కేసులపాలై ఇబ్బందులు పడొద్దని అన్నారు. ప్రశాంతం వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సమకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీధర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలను విడనాడాలి



నడికూడ : మాట్లాడుతున్న సీఐ వెంకటరత్నం

నడికూడ: పురాతన కాలం నాటి మూఢనమ్మకాలను విడనాడాలని పరకాల సీఐ వెంకటరత్నం అన్నారు. మండలంలోని ముస్త్యాలపల్లిలో పోలీస్ జాగృతి కళాబృందం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం మూఢనమ్మకాలు, బాల్య వివాహాలు, అత్యవసర సమయంలో డయల్ 100 తదితర అంశాలపై పాటలు, నృత్యాలతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పరకాల సీఐ వెంకటరత్నం మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి గొడవలు జరగకుండా ప్రజలు సహకరించాలని కోరారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌లను వాడకంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్సై రమేష్, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

14నుంచి కార్తీక మాసోత్సవాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆలయ చైర్మన్ వెంకటేశ్వర్లు, అర్చకులు

పరకాల: శ్రీకుంకుమేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 14వ తేదీ నుంచి డిసెంబర్ 13వ తేదీ వరకు కార్తీక మాసోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం చైర్మన్ గందె వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆలయ ప్రాంగణంలో కార్తీక మాసోత్సవాలకు సబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్తీక మాసం నెలరోజుల పాటు భక్తుల సహకారంతో ఉదయం అన్నదానం, సాయంత్రం అల్పాహారం అందించనున్నట్లు వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు కోమళ్లపల్లి నాగభూషణం శర్మ, ఈఓ వెంకటయ్యతో పాటు ఆలయ ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌కు బీసీని సీఎం చేసే దమ్ముందా



మాట్లాడుతున్న విజయ్‌చందర్‌రెడ్డి

ఆత్మకూరు: బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు బీసీ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థిని ముఖ్యమంత్రి చేసే దమ్ముందా అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ద్రోహం చేయడం కొత్తేమికాదన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ఒంటేరు జయపాల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అవినీతి పాలన రాజ్యమేలుతుందని అన్నారు. అవినీతిని అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, జిల్లా ప్రధాన కార్యదర్శి జితేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, మండల ప్రధానకార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, కార్యదర్శి బయ్య పైడి, ఓబీసీ జిల్లా కార్యదర్శి సముద్రాల రవి, ఎంపీటీసీ బయ్య రమరాజు, ప్రదీప్‌రెడ్డి, మధు పాల్గొన్నారు.

ఈసీ ఆదేశాలు అమలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హన్మకొండ అర్బన్: వికలాంగుల ఉద్యోగులకు ఎన్నికల విధులకు మినహాయింపు ఇవ్వాలని అధికారులను ఈనెల 4న తెలంగాణ ఎన్నికల కమిషన్ ఆదేశించిందని వికలాంగుల ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. ఈమేరకు ఈసీ ఆదేశాలను అమలు చేయాలని హనుమకొండ అదనపు కలెక్టర్ మహేందర్‌జీ కలెక్టరేట్‌లో బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఎన్నికల విధులు సరిగా నిర్వర్తించడం కష్టంగా ఉన్న వికలాంగ ఉద్యోగులు, పాలిచ్చే తల్లులు, దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్న ఉద్యోగులు, రిటైర్‌మెంట్‌కు ఆరు నెలల సమయం మాత్రమే ఉన్న ఉద్యోగులకు మినహాయింపు ఇచ్చే విషయాన్ని పరిశీలించాలని కోరారు. అనంతరం మహేందర్‌జీ మాట్లాడుతూ వికలాంగ ఉద్యోగులకు దగ్గర ప్రాంతాల్లోనే ఎన్నికల విధులు కేటాయిస్తామని చెప్పారు. సరైన వికలాంగత్వం ఉంటే తప్ప విధుల నుంచి మినహాయింపు ఇవ్వబోమని స్పష్టం చేశారు. కాగా, ఎన్నికల విధులకు సిబ్బంది తక్కువయ్యే అవకాశం ఉన్నందున అధిక వైకల్యంతో బాధపడుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయుల జాబితాను అదనపు కలెక్టర్‌కు సంఘం నాయకులు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు మన్నె చంద్రయ్య, వైట్ల వాణి, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్లలో పోలీసుల తనిఖీలు



కాజీపేట జంక్షన్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు



కాశిబుగ్గ: వరంగల్ రైల్వే జంక్షన్‌లో..

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజ్ ఆధ్వర్యంలో సివిల్, రైల్వే పోలీసులు బుధవారం సాయంత్రం తనిఖీలు చేపట్టారు. ఎన్నికల నేపథ్యంలో రైల్వే స్టేషన్‌లోని అన్ని రైల్వే ప్లాట్‌ఫాంలు కలియ తిరిగారు. అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను, వస్తువులను తనిఖీ చేశారు. తనిఖీల్లో సివిల్ ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు, ఎస్సై లలిత, పోలీసులు, జీఆర్పీ పోలీసులు పాల్గొన్నారు.

రైళ్లలో బాణసంచా తరలిస్తే కఠిన చర్యలు

కాశిబుగ్గ: రైళ్లలో బాణసంచా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్పీఎఫ్ పోలీసులు హెచ్చరించారు. వరంగల్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంలలో రైల్వే అధికారులతో కలిసి ఆర్పీఎఫ్ సిబ్బంది బుధవారం తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తుల బ్యాగులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైళ్లలో బాణసంచా వంటి పేలుడు పదార్థాలను తరలించవద్దని సూచించారు. ఒకవేళ అలాంటి వాటితో పట్టుబడితే రైల్వే యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తప్పవని అన్నారు. తనిఖీల్లో ఆర్పీఎఫ్ ఏఎస్సై నరేందర్, సీటీఐ వెంకటేశ్వర్లు ఉన్నారు.

వ్యక్తి దారుణ హత్య



హత్యకు గురైన లక్ష్మణ్

ధర్మసాగర్ : ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన మండలంలోని సాయిపేటలో జరిగింది. సీఐ శ్రీధర్‌రావు కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం గోపాలపురం గ్రామానికి చెందిన గండికోట లక్ష్మణ్ (35) ఎల్కతుర్తిలోని ఫాంహౌజ్‌లో పని చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన గండికోట శేఖర్, సూర శ్రీకాంత్, గండికోట రమేష్ మంగళవారం సాయంత్రం హనుమకొండకు వెళ్లి, మళ్లీ ఫాంహౌజ్‌కు వచ్చారు. అనంతరం అందరూ కలిసి ధర్మసాగర్ మండలం సాయిపేటలోని కంది తిరుపతి ఇంటికి వెళ్లి అక్కడే భోజనం చేశారు. తర్వాత షికారు కోసం సాయిపేట గ్రామ శివారుకు వెళ్లారు. అక్కడ గొర్రెల మంద వారిని చూసి అరవగా, పక్కనే ఉన్న కుక్కలు సైతం అరుస్తూ వారి వైపునకు పరుగెత్తుకు వచ్చాయి. కుక్కల వెనుక ఇద్దరు వ్యక్తులు వచ్చి వారిపై దాడి చేశారు. ఈ క్రమంలో లక్ష్మణ్ వారిని నివారించే ప్రయత్నం చేశాడు. కానీ సదురు వ్యక్తులు ఆగ్రహంతో ఊగిపోతూ లక్ష్మణ్‌ను గొడ్డలితో దారుణంగా నరికారు. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనను చూసిన మిగతా వారు అక్కడి నుంచి పారిపోయారు. నిందితులు సాయిపేట గ్రామానికి చెందిన దద్దు రాజయ్య, అతని కుమారుడు మహేందర్‌గా గుర్తించారు. ఈ ఘటనపై మృతుడి భార్య కల్యాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఒకరి రిమాండ్

శాయంపేట : పకృతిలో ఆహ్లాదంగా తిరిగే నీటి కాకిని చంపిన ఘటనలో వ్యక్తిని రిమాండ్‌కు పంపించినట్లు ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మైసయ్య తెలిపారు. మండల కేంద్రానికి చెందిన బంక కిరణ్ అక్టోబర్ 24వ తేదీన నీటి కాకిని వేటాడి చంపి వండుకొని తిన్నాడని సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చిందన్నారు. డీఎఫ్‌ఓ ఆదేశాల మేరకు అతని ఇంట్లో సోదాలు చేయగా అతని సెల్ ఫోన్‌లో ఫోటోలు, నీటి కాకిని చంపిన కత్తి, పరికరాలు లభించగా వాటిని స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలి



నామినేషన్ పత్రం అందజేస్తున్న సాంబయ్య

శాయంపేట : ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు బుద్ధి చెప్పాలని సీపీఐ భూపాలపల్లి నియోజకవర్గ అభ్యర్థి వంగరి సాంబయ్య అన్నారు. 70 శాతం బీసీలు ఉన్న నియోజకవర్గంలో బీసీలను విస్మరించిన రాజకీయ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. అనంతరం భూపాలపల్లి నియోజకవర్గ కేంద్రంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి రమాదేవికి తన నామినేషన్ పత్రాన్ని అందించారు.

పర్యావరణ పరిరక్షణకు ఐక్యవేదిక కృషి

వరంగల్ అర్బన్: పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా హనుమకొండ జిల్లా పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక (యూఎఫ్‌ఈపీ) పనిచేస్తున్నట్లు వేదిక ప్రతినిధులు తెలిపారు. అందుకు బల్దియా సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. వరంగల్ బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాను బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. తడి చెత్త, పొడి చెత్తను శాస్త్రీయ పద్ధతుల్లో వేరు చేయుట, నగర పరిధిలో ఉన్న చెరువులు, కుంటల పరిరక్షణ కమిటీలో తమ సంస్థ సభ్యులను భాగస్వాములు చేయాలని కోరారు. ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేదని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులను నివారించాలని సూచించారు. కాగా, ఐక్య వేదిక చేపట్టనున్న పర్యావరణ సమస్యలపై తమ వంతు సహకారం అందిస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి శ్రవణ్ కుమార్, ఉపాధ్యక్షుడు రవిబాబు, సహాయ కార్యదర్శి రాజయ్య, పరశురాములు, శ్రీనివాస్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే ఇంటింటా సంక్షేమ పథకాలు

- పరకాల బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి



దామెర : మాట్లాడుతున్న చల్లా ధర్మారెడ్డి

దామెర: రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌తోనే ఇంటింటా సంక్షేమ పథకాలు అందుతున్నాయని, బీఆర్‌ఎస్‌ను మరోసారి గెలిపించాలని పరకాల బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని దమ్మన్నపేట, ఒగ్లాపూర్, పసరగొండ, పులుకుర్తి గ్రామాల్లో బుధవారం గడపగడపకు తిరుగుతూ ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ మోసపూరిత మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. మూడు గంటలు కరెంటు ఇచ్చే కాంగ్రెస్ కావాలో 24 గంటలు ఇచ్చే బీఆర్‌ఎస్ కావాలో ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు గండు రాము, కృష్ణమూర్తి, జెడ్పీటీసీ గరిగె కల్పనకృష్ణమూర్తి, రైతుబంధు మండల సమితి కోఆర్డినేటర్ రమణారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు గట్ల విష్ణువర్ధన్‌రెడ్డి, ఒగ్లాపూర్ అభివృద్ధి కమిటీ చైర్మన్ కేతిపెల్లి శ్రీధర్ రెడ్డి, యూత్ వింగ్ అధ్యక్షుడు రాజు, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అక్తర్, గుండా చంద్రమోహన్, సర్పంచ్‌లు కేతిపెల్లి సరోజన, మేడిపల్లి సాంబయ్య, పుల్యాల రాణిరఘుపతిరెడ్డి, గోవిందుఅశోక్, ఎంపీటీసీ సంధ్య పాల్గొన్నారు.

ఆత్మకూరు: రాష్ట్రంలో కేసీఆర్ నాయకత్వంలో రామరాజ్యం నడుస్తుందని, కాంగ్రెస్ వస్తే రాక్షసపాలనేనని ఏది కావాలో ప్రజలు ఆలోచన చేయాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. బుధవారం రాత్రి మండల కేంద్రంతో పాటు మండలంలోని కామారం, తిరుమలగిరి గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు.

మట్టిపోశారు.. మేటలు వేశారు

- చలివాగుకు మళ్లీ గండి.!



చలివాగు ప్రాజెక్టుకు గండి పడిన ప్రదేశం

శాయంపేట : మండలంలోని జోగంపల్లి శివారు మధ్యతరహా చలివాగు ప్రాజెక్టు ప్రధాన కట్టకు మళ్లీ గండి పడింది. ఇటీవల చేపట్టిన గండి పూడ్చివేత పనుల్లో నాణ్యతలోపం కళ్లకుకొట్టొచ్చినట్లు కనిపిస్తుందని రైతులు మండిపడుతున్నారు. ఆయకట్టు రైతులకు సాగునీరు అందకుండా అధికారులు సాగునీటి సరఫరాను నిలిపివేశారు. ప్రాజెక్టు ప్రధాన కాల్వకు అక్టోబరు 29వ తేదీన గండిపడడంతో ఈనెల 1న దేవాదుల అధికారులు గండిని మట్టితో పూడ్చివేసి ఇసుక బస్తాలతో మేటలు వేసి చేతులు దులుపుకున్నారు. కిందిస్థాయి ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయగా మంగళవారం మధ్యాహ్నం అదేప్రదేశంలో మళ్లీ గండిపడి నీరు చలివాగులోకి మళ్లింది. విషయం తెలుసుకున్న అధికారులు సాగునీటి సరఫరాను నిలిపివేశారు. ఆయకట్టు కింద వరి పంటలు సాగు చేసిన రైతులు నీటికోసం ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చలివాగు గండిని పూడ్చి పంటలకు సాగునీరు విడుదల చేయాలని కోరుతున్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు అవగాహన అవసరం

- ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్

పరకాల: విద్యార్థి దశ నుంచే సమాజంలో ఉండే సమస్యలపై ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సంతోష్‌కుమార్ అన్నారు. ముందు వరుసలో ఉండటం వలన సమస్యల పరిష్కారానికి కృషి చేయవచ్చన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. విద్యార్థుల కోసం చేపట్టే తొలిమెట్టు కార్యక్రమం ఒక బృహత్తర కార్యక్రమం అన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల్లో, సొంత గ్రామాల్లో సేవచేసే అవకాశం తొలిమెట్టు ద్వారా రావడం చాలా అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి జి.ఓదేలు, అధ్యాపకులు డాక్టర్ ఎం.అరుణ, డాక్టర్ ఎల్.ఇందిరాదేవి, ఆర్.కుమారస్వామి, డాక్టర్ వి.రాజయ్య, అశోక్‌మోరె, ఎం.రవికుమార్, ఎ.అనిల్‌కుమార్, సుస్మిత, రాజశ్రీ, సంజయ్‌కుమార్, స్వప్న, శ్రీనివాస్, రఫీ, రాజు పాల్గొన్నారు.

బాధిత మహిళలకు అండగా ‘సఖి’



మాట్లాడుతున్న హైమావతి

ధర్మసాగర్: వేదింపులకు గురవుతున్న బాధిత మహిళలకు సఖి కేంద్రం అండగా నిలుస్తుందని సఖి సెంటర్ అడ్మిన్ హైమావతి అన్నారు. మండలంలోని ముప్పారం కేజీబీవీ విద్యార్థునులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సఖి సెంటర్ ముఖ్య ఉద్దేశాలు, అందిస్తున్న సేవలను వివరించారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి వన్ స్టాఫ్ సెంటర్ కొనసాగుతుందని, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. సఖి కేంద్రానికి వచ్చిన బాధిత మహిళలకు ఉచితంగా కౌన్సిలింగ్, న్యాయ, పోలీస్, వైద్య సహాయం, తాత్కాలిక వసతిని అందిస్తున్నామన్నారు. చట్టాలపై ప్రతి మహిళ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ అవకాశాన్ని బాధిత మహిళలు, బాలికలు వినియోగించుకోవాలన్నారు. ఫోన్ నంబర్ 0870- 2452112, లేదా టోల్ ఫ్రీ నంబర్ 181కు ఫోన్ చేసి సాయం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సెంటర్ కేస్ వర్కర్ హరిత, స్వర్ణలత, లావణ్య, కేసీబీవీ ఎస్‌ఓ మాధవి, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి



దామెరలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, మహిళలు

దామెర: అర్హులైన ప్రతిఒక్కరూ ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని డీడబ్ల్యూఓ మధురిమ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం స్వీప్ ప్రోగ్రాంలో భాగంగా పలువరికి అవగాహన కల్పించిన అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన పవిత్రమైన ఆయుధం ఓటుహక్కు అన్నారు. అర్హులైన ఓటర్లు అందరూ ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వచ్ఛందంగా ఓటు వేసి తమకు ఇష్టమైన నాయకుడిని ఎన్నుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి శ్రీనివాసరావు, పరకాల ప్రాజెక్టు సీడీపీఓ భాగ్యలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జంగం రాణి, బీఎల్‌ఓలు రజిత, వనజ, కోమల, శైలజ తదితరులు ఉన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9553955722
9010299096
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎన్. కల్యాణ్ (S.R) : 8686236437 (ఎల్కతుర్తి)
కె. సుధాకర్ (A.C.O) : 9177258410 (హన్మకొండ)